## సావుకారి దగ్గర అప్ప తేవడం బందు జేసిన



గప్పట్ల ఎవుసం జేయాలంటే సావుకారు వద్దకు అప్పు కోసం పోయేటోన్ని. పొద్దస్తమానం సావుకారు ఇంటికాడనే ఉండి కాల్మొక్త సేటు.. నారు యాతకొచ్చింది. ఎట్లన్న జేసి అప్పు ఇవ్వు అని పది మార్లు బతిలాడితే కానీ అప్పు పుట్టకపోయేది. ఆరుగాలం కష్టించి పండించిన పంటంతా అమ్మినా సేటు అప్పు తీరకపోయేది. దేవుడి లెక్క సీఎం కేసీఆర్ సారు వచ్చి ప్రతి కారుకు రైతుబంధు డబ్బులు ఇచ్చిన కాన్నుంచి సావుకారు వద్దకు అప్పు కోసం పోవడం బందు జేసిన. యాడాదిలో రెండు మాట్ల బ్యాంకులో జమ జేసే డబ్బులతో లాగోడి పెట్టుకొని ఎవుసం జేస్తున్న. సావుకారు దగ్గర జేసిన అప్పు రెండు పంటల్లోనే తీర్చిన. సీఎం సారు అండగా నిలువకపోతే అప్పుల పాలై పోతుంటి. మళ్ల కారుకు రైతుబంధు పెంచి ఇస్తుండని తెలిసి ఎంతో సంతోషం అనిపించింది. మాలాంటోళ్లకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి సారు ఎప్పుడూ సల్లగా ఉండాలి.

– తుంగ నగేశ్, రైతు, రఘునాథపురం, రాజాపేట మండలం





## రైతులకు అండగా నిలుస్తున్న సీఎం కేసీఆర్



రైతుబంధు ద్వారా పెట్టుబడి సాయం ఎకరానికి రూ.16వేలు అందిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడం సంతోషం. రైతు బాధల గురించి ఏ పార్టీ ఇంతవరకు ఆలోచించలేదు. మన సీఎం కేసీఆర్ రైతుల పాలిట దైవంగా మారి ఎకరానికి రూ.10వేలు అందిస్తున్నాడు. రానున్న రోజుల్లో రూ.16వేలు చేస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించడం మంచి పరిణామం. ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు డబ్బు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయడంతోపాటు దున్నకానికి, కూలీల ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అప్పు చేసే బాధ కూడా తప్పడంతో రైతులందరం హాయిగా ఉన్నాం. రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అండగా నిలుస్తాం.

– నోముల లక్ష్మీనరసింహారెడ్డి, రైతు, తిమ్మాపురం, ఆత్మకూరు(ఎం) మండలం

# రైతుబంధు @ ₹16 వేలు

## అన్నదాతకు మరింత సాయం

**మ్యానిఫెస్టోలో ప్రకటించిన బీఆర్ఎస్ పార్టీ**

**మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు**

**తొలి ఏడాది రూ. 12వేలు.. క్రమంగా రూ.16వేలకు పెంపు**

**జిల్లాలో 2.40 లక్షల మంది రైతులకు మేలు**

**ఏటా రూ.160 కోట్లకుపైగా ప్రభుత్వంపై అదనపు భారం**

**ఇప్పటికే సమర్థవంతంగా అమలవుతున్న రైతుబంధు**

**అన్నదాతను అన్ని విధాలుగా ఆదుకుంటున్న సర్కారు**

**పెట్టుబడి సాయం పెంపుపై హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు**

దేశంలో రైతులకు పంట పెట్టుబడికి ప్రభుత్వ సాయం చేయాలనే ఆలోచన ఏ ఒక్క పార్టీ చేయలేదు. రైతుబంధు సృష్టికర్త అయిన సీఎం కేసీఆర్.. రైతులను అప్పుల ఊబి నుంచి బయటపడేయాలని ఈ పథకానికి రూపకల్పన చేశారు. ఇది ఎన్నికల్లో ఇచ్చిన హామీ కాదు.. మ్యానిఫెస్టోలో పొందుపర్చింది కూడా కాదు. అయినా నిబద్ధత, నిజాయితో 2018లో రైతుబంధు పథకాన్ని తీసుకొచ్చారు. ప్రస్తుతం రైతుబంధు కింద పంట పెట్టుబడి కోసం ఏటా రూ.10వేల సాయం అందుతున్నది. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే రైతుబంధు సాయాన్ని మొదటి సంవత్సరం ఎకరాకు ఏటా రూ.12వేలకు పెంచనున్నారు. క్రమంగా పెంచుతూ రానున్న ఐదేండ్లలో గరిష్ఠంగా ఎకరానికి ఏటా రూ.16వేలకు పెంచుతామని బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో పొందుపరిచారు. అధికారంలోకి రాగానే అమలు చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఇది అమల్లోకి వస్తే జిల్లాలో సుమారు 2.40లక్షల మంది అన్నదాతలకు మేలు జరుగనుంది. దీని ద్వారా ఏటా రూ.160 కోట్లకు పైగా ప్రభుత్వంపై ఆర్థిక భారం పడనుంది.

– యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ)

## రైతుబంధు పెంపుతో మరింత భరోసా



రైతుల కష్టాన్ని అర్థం చేసుకున్నది సీఎం కేసీఆర్ ఒక్కరే. రైతులు పెట్టుబడులకు ఇబ్బంది పడుతున్నరని రైతుబంధు పథకాన్ని తీసుకొచ్చారు. పెట్టుబడి సాయం కింద ఎకరానికి రూ.5వేల చొప్పున ఏడాదిలో రెండు పంటలకు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. నాకు కొండమల్లేపల్లి పరిధిలోని కోల్‌ముంతల్‌పహాడ్ గ్రామ పరిధిలో ఐదెకాల భూమి ఉంది అందులో ఎకరం వరి, నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నా. ఏటా రైతుబంధు డబ్బు రూ.50 వేలు నా ఖాతాలో పడుతున్నయి. రైతుల కష్టనష్టాలు ఎరిగిన ముఖ్యమంత్రి కేసీఆర్ పెట్టుబడి సాయాన్ని దశల వారీగా రూ.16వేలకు పెంచుతామని ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించడం ఆనందంగా ఉన్నది. మా లాంటి రైతులకు ఇంతకంటే ఏం కావాలి. గత ప్రభుత్వాల హయాంలో పంట తడుపుకోవడానికి నానా అవస్థలు పడేటోళ్లం. ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని కరెంటుతో ఇబ్బందులుండేవి. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక 24 గంటల కరెంటు ఇస్తుండడంతో అవసరమైనప్పుడు పంటకు నీళ్లు పెట్టుకుంటున్నం. అన్నదాతకు మేలు చేసే ఇలాంటి ప్రభుత్వం ఉండడం మా అదృష్టం. రైతుల మేలు కోరే ముఖ్యమంత్రిని మళ్లీ గెలిపించుకుంటం.

– బూడిద రమేశ్, రైతు, కొండమల్లేపల్లి

## రైతులను ఆదుకుంటున్న కేసీఆర్ సారుకు రుణపడి ఉంటాం



నేను పదేండ్లుగా వ్యవసాయం చేస్తున్నా. రైతులకు ఇంత మంచిగా సాయం చేసిన పార్టీలు గతంలో ఎప్పుడూ చూడలేదు. అప్పట్లో సరిగ్గా కరెంటు ఉండకపోయేది. పంట పెట్టుబడి కోసం తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. 3 రూపాయల మిత్తికి అప్పు తెచ్చి పంటలు సాగు చేసేది. ధాన్యాన్ని తక్కువ ధరకే అమ్ముకునేవాళ్లం. పండించిన పంటంతా అప్పులకే సరిపోయేది. ముఖ్యమంత్రి కేసీఆర్ మొదటిసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల గోసను తీర్చేందుకు రైతుబంధు ద్వారా ఎకరానికి ఏటా రూ.8వేలు ఇచ్చిండు. దానిని రూ.10వేలకు పెంచిండు. మళ్లీ ఇప్పుడు రూ.12వేలు ఇవ్వడంతోపాటు ఐదేండ్ల వరకు రూ.16వేలు ఇస్తామంటున్నడు. అదునుకు డబ్బులు ఇవ్వడంతో పెట్టుబడి భారం తగ్గింది. మరణించిన రైతు కుటుంబానికి ప్రమాద బీమా కింద రూ.5లక్షలు, వ్యవసాయానికి 24గంటల కరెంటు ఇస్తూ ప్రభుత్వమే వడ్లు కొనడంతో మాకు ఎంతో మేలు జరుగుతున్నది. రైతును ఇంత మంచిగా ఆదుకున్న సీఎం కేసీఆర్ సారుకు రుణపడి ఉంటాం. రైతుల కోసం నిత్యం ఆలోచిస్తున్న కేసీఆర్ సారును మళ్లీ గెలిపించుకుంటాం.

– బీసం మల్లేశం, రైతు, లక్ష్మీదేవిగూడెం, మునుగోడు మండలం

## కేసీఆర్ సారుతోనే రైతులకు మేలు



గతంలో ఏ ముఖ్యమంత్రీ రైతులకు మేలు చెయ్యలె. కేసీఆర్ సారు సీఎం అయినంక రైతులు అడగకుండానే బాధలన్నీ తీర్చిండు. మా తండాకు కాళేశ్వరం నీళ్లు పుష్కలంగా వచ్చినయ్. దీనికి తోడు రైతు బంధు, రైతు బీమా, అన్ని రకాల పంటలకు అందుబాటులో ఎరువులు ఉంచుతూ మద్దతు ధర ఇచ్చి పంటలు కొనుగోలు చేస్తున్నారు. గతంలో వ్యవసాయం చేయాలంటే అప్పుల కోసం తిరిగేది. సీఎం కేసీఆర్ సారు చెప్పిన విధంగా పంటలు మొదలు పెట్టకమునుపే మా ఖాతాల్లో డబ్బులు పడుతున్నయి. దాంతో అప్పుల కోసం తిరిగే పనిలేకుండా పోయింది. ఇప్పుడు పెరుగుతున్న ఖర్చులు చూసి ఏడాదికి రూ.16 వేలు ఇస్తామని సీఎం కేసీఆర్ చెప్పిండు. దీని వల్ల రైతులకు ఇంకా మేలు జరుగుద్ది. రైతుల కోసం ఇంతగా ఆలోచించిన నాయకున్ని ఇంతవరకూ సూడలే. కేసీఆర్ సారుకు ఎప్పుడూ రుణపడి ఉంటాం.

– బానోతు దేవేందర్, రైతు, మూన్యానాయక్‌తండా, చివ్వెంల మండలం

## సీఎం కేసీఆర్ మాటిస్తే తప్పడు



రైతుల సంక్షేమం గురించి ఆలోచించే ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగలా మార్చారు. రైతును రాజు చేసేందుకు తీసుకొచ్చిన రైతుబంధు పథకం అన్నదాతకు కొండంత అండనిస్తుంది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇస్తున్న రైతుబంధు పెట్టుబడి సాయంతో రైతుల అరిగోస తీరింది. సీఎం కేసీఆర్ ఎకరానికి ఏడాదికి రూ.10 వేలు అందిస్తూ రైతులు అప్పుల ఊబిలో పడిపోకుండా అండగా నిలుస్తున్నారు. మళ్లీ గెలిస్తే ఏడాదికి ఎకరానికి రూ.16వేలు ఇవ్వనున్నట్లు బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించడం హర్షించదగినది. ముఖ్యమంత్రి కేసీఆర్ మాటంటే మాటే. రైతులకు ఇచ్చిన హామీని తప్పనే తప్పడు. మళ్లీ వచ్చే బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతన్నలు బంగారు పంటలు పండించి బంగారు తెలంగాణలో భాగస్వాములవుతారు.

– భీమనబోయిన భిక్షపతి, రైతు, మొగిలిపాక గ్రామం, వలిగొండ మండలం

## ఇప్పటికే రూ.2800 కోట్ల రైతుబంధు సాయం

రైతులు పంట సమయంలో పెట్టుబడి తెచ్చుకొని అప్పుల పాలయ్యే క్షోభను తప్పించి ప్రభుత్వమే పంట సాయం ఇస్తున్నది. దేశ చరిత్రలో ఏ ప్రభుత్వమూ రైతు పక్షాన నిలబడి ఇంతగొప్ప నిర్ణయం తీసుకోలేదు. 2018 మే 10న సీఎం కేసీఆర్ రైతుబంధు పథకాన్ని ప్రారంభించారు. ఏటా ఎకరానికి రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం ఇస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.2800 కోట్లను పంట సాయంగా అందజేశారు.

## అన్నదాతకు దన్నుగా..

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు దన్నుగా నిలుస్తున్నది. సమైక్య రాష్ట్రంలో దండుగ అన్న వ్యవసాయాన్ని పండుగలా చేసి చూపించింది. రైతుబంధుతోపాటు రైతు బీమా పథకంతో ఆయా కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నది. దేశంలో ఎక్కడా లేని విధంగా 24గంటల ఉచిత కరెంట్ అందిస్తున్నది. అన్ని కాలాల్లో ఎప్పటికప్పుడు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నది. మిషన్ కాకతీయ, చెక్‌డ్యామ్‌లు, రిజర్వాయర్లతో నిండు వేసవిలో సైతం నీళ్లు సమృద్ధిగా ఉంటున్నాయి. మద్దతు ధరతో ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నది. భూ రికార్డులను సమగ్ర ప్రక్షాళన చేపట్టింది. రైతులకు ఇబ్బందులు లేకుండా ధరణికి శ్రీకారం చుట్టింది.

## మోటర్లకు మీటర్లు వద్దు.. కేసీఆర్ దిక్కే ఉంటాం



నాకు ఎకరం పొలం ఉంది. సీఎం కేసీఆర్ సీజన్‌కు రూ.5వేల రైతు బంధు డబ్బులు ఇస్తుండు. సంవత్సరానికి రూ.10 వేలు అందుతున్నాయి. ఆ పైసలను ఎరువులు, విత్తనాలు కొనడానికి వాడుతాను. 24 గంటల కరెంటు వల్ల మోటర్లు పుష్కలంగా పోస్తున్నాయి. పంట దిగుబడి మంచిగా వస్తున్నది. మళ్ల ఎన్నికలల్ల గెలిస్తే ఎకరానికి రూ.8వేలు ఇస్తడంట. బీఆర్ఎస్ ఎన్నికల హామీలు చూసి కాంగ్రెసోళ్లు కంగుతింటున్నరు. మా రైతులకు 3 గంటల కరెంటు ఇస్తే సాలని రేవంత్‌రెడ్డి పిచ్చికూతలు కూస్తుండు. మోటర్లకు మీటర్లు మాకొద్దు.. సీఎం కేసీఆర్ దిక్కే రైతులమంతా ఉండి మళ్లా గెలిపించుకుంటం. రైతుబంధు డబల్ చేయించుకుంటం.

– బాదిని అంతమ్మ, నోముల, నకిరేకల్ మండలం





నకిరేకల్ : వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జమ్మి చెట్టు వద్ద శమీ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్



సూర్యాపేటలో దసరా వేడుకల్లో పాల్గొని చిన్నారులతో సెల్ఫీ దిగుతున్న మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

# దసరా సంబురం



## ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా వైభవంగా వేడుకలు

చెడుపై మంచి విజయానికి సూచకంగా జరుపుకొనే విజయదశమి వేడుకలను ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. పండుగకు బంధుమిత్రులు, పట్టణాల్లో ఉండే కుటుంబ సభ్యుల రాకతో పల్లెలు సందడిగా కనిపించాయి. ఉదయం పలు ఆలయాల్లో పూజలు నిర్వహించగా.. సాయంత్రం జమ్మి చెట్టు వద్ద శమీ పూజలు చేశారు. జమ్మి ఆకును ఒకరికొకరు పంచుకొని దసరా శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. పలుచోట్ల రావణాసురుడి దిష్టిబొమ్మలను దహనం చేశారు. వేడుకల్లో ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



హాలియా : రామాలయంలో జమ్మి ఆకు తీసుకుంటున్న ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్



నల్లగొండ రామాలయంలో శమీ పూజ..



యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం మాఢ వీధుల్లో శమీ పూజలో పాల్గొన్న ఆలయ ఈఓ ఎన్.గీత, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి. ఆలయ సిబ్బంది



నల్లగొండ వివేకానంద నగర్‌లో రావణ దహనం



నల్లగొండ పట్టణంలోని శ్రీదేవి భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శమీ పూజలో పాల్గొన్న భక్తులు



పెన్‌పహాడ్ : అనంతారంలో శమీ పూజలో పాల్గొన్న జడ్పీటీసీ అనిత, స్థానికులు



మఠంపల్లి మండల కేంద్రంలో జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న ప్రజలు